ఎంత వద్దనుకున్నా అబ్దుల్ మనసులోంచి అతని భార్య ఫాతిమా- సగం సోఫాలో, సగం కింద పడున్న ఫాతిమా- రూపం పోవడం లేదు. అనుకోకుండా, ఎంతో నిశ్శబ్దంగా జరిగిపోయిందది.

గత పదకొండేళ్లుగా తమ జీవితంలో సాగు



# పాస్‌పోర్ట్

-మల్లాది వెంకటకృష్ణమూర్తి

తున్నట్లుగా, ఆరోజు కూడా ఆ భార్యాభర్తలిద్దరి మధ్య ఆర్గ్యుమెంట్ మొదలైంది. చాలా చిన్న విషయం. ఢిల్లీలోని కన్నాట్‌ప్లేస్‌లోని ఓ దుకాణానికి తమ లివింగ్ రూంకి ఓ కార్పెట్‌ని కొనాలని ఇద్దరూ వెళ్లారు. అబ్దుల్‌కి నచ్చింది ఫాతిమాకి నచ్చలేదు. ఫాతిమా తనకి నచ్చింది కొందామంటే, అబ్దుల్ కాదన్నాడు.

కార్పెట్ కొనకుండా ఇద్దరూ మౌనంగా ఇంటికి వచ్చారు. బయట సభ్యత అడ్డుపడడంతో తన కోపాన్ని అణచుకున్న ఫాతిమా ఇంట్లోకి రాగానే భర్త మీద గయ్యిమంది.

పదకొండేళ్లుగా పేరుకుని వున్న కోపం లావాలా అతనిలో బయటికి తన్నుకు వచ్చింది. ఆ కోపంతో ఎప్పుడు వంటగదిలోకి వెళ్లాడో, ఎప్పుడు కత్తుల సెట్లోంచి పెద్ద కత్తిని తీసుకున్నాడో, ఎప్పుడు ముందు గదిలోకి వచ్చి తన భార్య బొడ్డు పైన పొడిచాడో కూడా అబ్దుల్‌కి సరిగ్గా జ్ఞాపకం లేదు. పూనకం వచ్చిన వాడి స్థితిలో తను తనకి తెలియకుండానే ఫాతిమాని హత్య చేశాడని నాలుగైదు నిముషాల తర్వాత గ్రహించాడు. వెంటనే అతనిలో భయం, వణుకు మొదలయ్యాయి. అయితే అబ్దుల్‌ది ప్రాక్టికల్ మైండ్. ఆ ఆపదలోంచి ఎలా బయటపడాలో అరగంటలో ఆలోచించుకున్నాడు. పాకిస్థాన్‌లోని ఒకరికి ఎస్.టి.డి. బూత్ నుంచి ఫోన్ చేసి మాట్లాడాడు.

ఆ ప్రకారం పాత ఢిల్లీలోని ఓ సింగ్ దగ్గరికి చేరుకున్నాడు. అబ్దుల్ పాకిస్థాన్‌లో వుండగా ఇతని గురించి విని వున్నాడు. ఎనభై రెండేళ్ల వయసున్న ఆయన్ని అడిగాడు-

"నాకో పాస్‌పోర్ట్ కావాలి"

"ఇది పాస్‌పోర్ట్ ఆఫీస్ కాదు" చెప్పాడాయన.

"మీ గురించి రసూల్‌ఖాన్ చెప్పాడు"

"ఏ రసూల్‌ఖాన్?"

"రావల్పిండి పక్కనున్న పస్తాపూర్ విలేజ్‌లో కేబుల్ ఆపరేటర్, అతను నా కజిన్."

"ఓ!" ఆయన నవ్వితే బంగారు పళ్లు నాలుగు తళుక్కుమన్నాయి.

బేరం కుదిరాక డబ్బు చేతులు మారింది.

"పాస్‌పోర్ట్‌లో ఫొటోలు మారుస్తాను. మిగిలిన వివరాలన్నీ అలాగే వుంటాయి. లక్కీగా మీ బరువు, ఎత్తు, వయసుకి సరిపడా పాస్‌పోర్ట్ నా దగ్గర రెడీగా వుంది. రాత్రి ఎనిమిదికల్లా దాన్ని సిద్ధం చేస్తాను" చెప్పాడా సింగ్.

"పాకిస్థాన్‌కి నా ట్రెయిన్ రేపు ఉదయం ఆరున్నరకి" గుర్తుచేశాడు అబ్దుల్.

"డోంట్ వర్రీ... మీరందులో వెళ్లచ్చు. పది గంటల ముందే పాస్‌పోర్ట్ ఇస్తున్నాగా. మీ అసలు పాస్‌పోర్ట్ నాకిస్తే, ఏభై వేలు తగ్గుతాయి. నేను దొంగ పాస్‌పోర్ట్‌లు అమ్మడమే కాదు, కొంటాను కూడా."

మళ్లీ ఆయన నవ్వితే బంగారు పళ్లు మెరిశాయి.

ఇంక తనకి తన అసలు పాస్‌పోర్ట్‌తో పని వుండదు కాబట్టి అబ్దుల్ దాన్ని అమ్మదలిచాడు.

"ఏం చేస్తుంటారు?" అడిగాడు సింగ్. అతని పాస్‌పోర్ట్‌లో వృత్తి దగ్గర వ్యాపారం అని వుండడంతో.

"మార్బుల్ బిజినెస్. అవి కొనడానికి తరచూ విదేశాలు వెళ్తుంటాను" చెప్పాడు అబ్దుల్.

- - -

రాత్రి ఎనిమిదికి అబ్దుల్ పాస్‌పోర్ట్, మిగిలిన సొమ్ము తీసుకుని సింగ్ అతనికి నకిలీ పాస్‌పోర్ట్ ఇచ్చి చెప్పాడు.

"నే చెప్పింది గుర్తుంచుకుని మళ్లీ చెప్పండి- మీ పేరు గఫూర్‌ఖాన్. 'పాకిస్థాన్ టైమ్స్'లో జర్నలిస్ట్‌గా పనిచేస్తున్నారు. రావల్పిండి నించి వెనక్కి రమ్మని పిలవడంతో వెళ్తున్నారు. బ్రహ్మచారి."

అబ్దుల్ ఆ వివరాలు తిరిగి చెప్పాక సింగ్ ఓ సూట్‌కేస్ కూడా ఇచ్చి చెప్పాడు.

"ఇది అతనిది. మీ వెంట తీసుకెళితే కస్టమ్స్ వారు మిమ్మల్ని అనుమానించరు. దాని ఖరీదు అయిదు వేలు. ఇందులో అతని దుస్తులు, పర్సనల్ వస్తువులు ఉన్నాయి."

అబ్దుల్ బేరం ఆడకుండా ఆ డబ్బు చెల్లించి అనేకసార్లు ప్రయాణం చేసినట్లుగా, అనేక ఎయిర్‌లైన్స్ లేబుల్స్ అతికించి వున్న ఆ పాత

సూట్‌కేస్‌ని తీసుకున్నాడు.

ఢిల్లీ కస్టమ్స్ అధికారులు కానీ, ఇమిగ్రేషన్ అధికారులు కానీ, సెక్యూరిటీ వాళ్లు కానీ అతని పాస్‌పోర్ట్‌ని చూసి అనుమానించలేదు. స్టాంప్ వేసి తిరిగి ఇచ్చారు. సింగ్ నైపుణ్యం అలాంటిది. సంఝౌతా ఎక్స్‌ప్రెస్ బయలుదేరాక దీర్ఘంగా నిట్టూర్చాడు అబ్దుల్. సేఫ్. ఇక తను సేఫ్.

ఓసారి రైలు బోర్డర్ దాటితే, ఇంక తనని ఇండియన్ పోలీసులు ఏం చేయలేరు. సద్దుమణిగాక కొన్ని నెలలకి తిరిగి రావచ్చు.

అతనికి మాగన్నుగా నిద్రపట్టింది. హాలిడే కోసం ఢిల్లీ ప్రజలు వెళ్లే ఓ చిన్న స్టేషన్‌లో రైలు ఆగింది. కొందరు దిగారు. ఆ స్టేషన్‌లో ఇద్దరు ఎక్కారు.

రైలు కదిలాక ఆ ఇద్దరూ ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్‌లోని అబ్దుల్ కేబిన్ తలుపు దగ్గర ఆగి దాని మీద తట్టారు. అబ్దుల్ లేచి తలుపు తెరవగానే లోపలకి వచ్చారు.

ముప్పై ఏళ్ల వయసున్న ఆ ఇద్దరిలో ఒకడు అడిగాడు–

"మీ పాస్‌పోర్ట్‌ని ఓసారి చూపిస్తారా?"

"మీరెవరు?" అడిగాడు అబ్దుల్ కంగారుని అణచుకుంటూ.

"పోలీసులం"

అబ్దుల్ మొహంలో వెంటనే రంగులు మారాయి.

"దేనికి?"

"మీ పేరు గఫూర్‌ఖానేనా?" అడిగాడు ఇంకొకడు.

"అవును."

"పాకిస్థాన్ టైమ్స్‌లో జర్నలిస్ట్‌గా పనిచేస్తున్నారా?"

"అవును."

ఆ ఇద్దరిలో ఒకడు అబ్దుల్ ఇచ్చిన పాస్‌పోర్ట్‌ని జాగ్రత్తగా చూసి, తన పక్కనున్నతని వంక చూసి చిన్నగా తల వూపాడు. వెంటనే అతను జేబులోంచి సైలెన్సర్ అమర్చిన పిస్తోలు తీసి అబ్దుల్ నుదుటికి గొట్టాన్ని రెండంగుళాల దూరంలో వుంచి ట్రిగ్గర్‌ని నొక్కాడు. ఆ శబ్దం బయటకు ఎవరికీ వినిపించలేదు. అబ్దుల్ కుప్పకూలిపోయాడు.

– – –

ఆ రాత్రి పాకిస్థాన్‌లోని ఐఎస్ఐ హెడ్‌క్వార్టర్స్‌కి చేరుకున్నాడు ఓ ముప్పై రెండేళ్ల యువకుడు. మారణాయుధాల్లో, పేలుడు పదార్థాల్లో శిక్షణ పొందిన ఆ ఐఎస్ఐ ఏజెంట్ రాటుదేలిన గూఢచారి. అతని పేరు రషీద్.

ఐఎస్ఐలోని ఇండియా విభాగంలోని అధికారి అతనితో చెప్పాడు.

"నిన్న రాత్రి ఇండియా నుంచి బయలుదేరిన సంఝౌతా ఎక్స్‌ప్రెస్‌లో గఫూర్‌ఖాన్ అనే అతన్ని ఎవరో కాల్చి చంపినట్లు ఇండియన్ కస్టమ్స్ అధికారులు కనుక్కున్నారు. ఇక ఇండియా పోలీసులు కానీ, వారి గూఢచారులు కానీ నీ కోసం చూడరు– నువ్వు మరణించావనే నమ్ముతున్నారు కనుక నీ దేశం వాళ్లకి తెలీదు కదా. నువ్వు గత రాత్రి ఆ రైల్లో పాకిస్థాన్‌కి గఫూర్‌ఖాన్ అనే మారుపేరుతో ప్రయాణిస్తున్నావని, వాళ్లకి సమాచారం అందేలా మనం చేసిన ఏర్పాటు ఫెయిల్ కాలేదు. నిన్ను ఎవరు చంపారో, ఎందుకు చంపారో వాళ్లకి అర్థం కావడం లేదు. నీతో ఎప్పుడూ కారీ చేసే బంగారం కోసం హత్య చేశారనుకుంటున్నారు. అది నీ సూట్‌కేస్‌లోంచి మాయం అవడంతో. మన వాళ్లే ఆ హత్య చేశారని వాళ్లు కనుక్కోలేరు."

"చాలా మంచి ఏర్పాటు" నవ్వాడు రషీద్.

"పదహారో తారీఖు ఢిల్లీ చేరుకునే రైల్లో నువ్వు ప్రయాణిస్తున్నావు. అక్కడికి సేఫ్‌గా చేరాక మెసేజ్ పంపు. ఇదిగో నీ పాస్‌పోర్ట్. ఇండియన్ పాస్‌పోర్ట్ కాబట్టి చిక్కే లేదు."

ఆయనందించిన పాస్‌పోర్ట్ తిరగేస్తూ బయటికి చదివాడు రషీద్.

"పేరు అబ్దుల్. భార్య పేరు ఫాతిమా. మార్బుల్ వ్యాపారం. బావుంది."

"వెళ్లగానే నీకు అప్పజెప్పిన విధ్వంసకాండ మొదలెట్టు" ఆజ్ఞాపించాడా అధికారి.

– – –

ఢిల్లీ నుంచి వెలువడే 'టైమ్స్ ఆఫ్ ఇండియా'లో ఫాతిమా హత్య జరిగిన నాలుగో రోజు 'ఏ డెడ్


బాడీ ఇన్ లివింగ్ రూమ్' అన్న శీర్షిక కింద ఫాతిమా హత్య గురించి రాస్తూ, పోలీసులు అనుమానితుడైన ఫాతిమా భర్త అబ్దుల్ కోసం వెదుకుతున్నారని, అతను పరారీలో వున్నాడని, ఇంట్లోని అన్ని ఫొటోలు తీసుకెళ్లిపోయాడని, బ్యాంక్‌లోని డబ్బు మొత్తం డ్రా చేసేశాడన్న వివరాలు రాశారు.

ఢిల్లీలోని ఇమిగ్రేషన్, కస్టమ్స్, సెక్యూరిటీ అధికారులందరికీ రొటీన్‌గా అతని పాస్‌పోర్ట్ వివరాలు అప్పటికే అందాయి - అతను తారసపడితే పట్టుకోమన్న ఆదేశాలతో.

వాళ్లకి అవి అందిన కొద్ది గంటలకి పాకిస్థాన్ నుంచి వచ్చిన రైల్లోంచి న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో దిగాడు రషీద్. అబ్దుల్ పాస్‌పోర్ట్‌లోని అతని సంతకాన్ని దారంతా ప్రాక్టీస్ చేస్తూ వచ్చిన రషీద్, ఆ పాస్‌పోర్ట్‌తో కస్టమ్స్ క్యూలో నిలబడ్డాడు. ○

# భేతాళ ప్రశ్న

- భండారు శ్రీనివాసరావు



భేతాళుడ్ని భుజాన మోసుకుంటూ విక్రమార్కుడు దారితప్పి హైదరాబాద్ నగరానికి వచ్చాడు. అడవుల్లో తిరిగి తిరిగి వున్నాడేమో భాగ్యనగరాన్ని చూడగానే ఆ రాజుకి ప్రాణం లేచొచ్చింది. ఎటు చూసినా విశాలమైన తారు రోడ్లు. ఎత్తయిన కాంక్రీటు భవంతులు - ఇవన్నీ చూసుకుంటూ ఒక బస్‌స్టాప్‌కు చేరుకున్నాడు. అక్కడి దృశ్యం అతడ్ని నివ్వెరపరచింది. అదేమిటో కాని- బస్సులన్నీ స్టాపు దాకా వేగంగా వచ్చి - ఆగినట్టే ఆగి ఆగకుండా వెడుతున్నాయి. ఎక్కాలనుకునే జనం ఎక్కలేక - ఇటు నుంచి అటూ- అటు నుంచి ఇటూ- బస్సులకంటే వేగంగా పరుగెడుతున్నారు. భుజాన బేతాళుడితో సహా ఏదయినా బస్సులోకి ఎక్కాలని విక్రమార్కుడు ఎంతయినా ఉబలాటపడ్డాడు కానీ ప్రయోజనం లేకపోయింది. రోడ్లమీద కంటే సిటీ బస్సులు స్టాపుల్లో ఎందుకు అంత వేగంగా పరుగెడతాయో ఆ పిచ్చి మారాజుకి అర్థం కాలేదు.

అప్పుడు భేతాళుడిలా అన్నాడు.

విక్రమార్కా! నిన్ను చూస్తే జాలేస్తోంది. నీవు కూడా జవాబు చెప్పలేని ప్రశ్న ఒకటుంది. అది చెప్పేస్తే అంతులేని ఈ భేతాళ కథలు ఇంతటితో అయిపోతాయేమో అని నీ సందేహం. అయినా చెబుతున్నా విను.

"ఆగని బస్సుల కోసం ఇంత విశాలమైన బస్‌స్టాపులు - ఇంత సర్వాంగ సుందరంగా - ఇన్ని వసతులతో ఎందుకు కట్టించారనుకున్నావ్! ఫుట్‌బాల్ ఆటలో బంతిలా - స్టాపులో అటూ ఇటూ పరిగెత్తిన, విసుగెత్తిన జనం అలసట తీర్చుకోవడానికి.

" ఇక నేను సయితం జవాబు చెప్పలేని ప్రశ్న ఏమిటంటావా?

అదిగో అటు విను.

"మాష్టారూ! ఈ స్టాపులో బస్సాగుతుందా?"

○